# టేకిటీజ్-ఈజీ శిల్పి

శృంగార వీధి

**"హాయ్ సెక్సీ!" అంటూ పలకరింపు వినబడితే కవిత తలతిప్పి చూసింది. 'ఎవర్రా ఇంత చొరవగా పలకరించేది?' అనుకుంది.**

చూడగానే గుర్తుపట్టింది. టీవీలో 'టేకిట్ ఈజీ' ప్రోగ్రాంలో కనబడే కుర్రాడు. దానిలో ఇలా రోడ్డుమీద హఠాత్తుగా మనుషుల్ని పలకరించి హడావుడిపెట్టి వాళ్లనొట్టి వెర్రిపీనుగులుగా చూపిస్తాడతను. ఆ ప్రోగ్రాం చూసి తను చాలాసార్లు అనుకుంది- అనూహ్యపరిస్థితులెదురైనప్పుడు మనుషులంత ఇదిగా బిత్తరపోతారెందుకురా? అని. అనుకోకుండా తనే చిక్కుకుందీనాడు. లక్షలాది ప్రజలు ఎదురుచూస్తుంటారు. తనెలా బెదిరిపోతుందా, తబ్బిబ్బు పడుతుందాఅని. తనేమాత్రం చెక్కుచెదరదని నిరూపించుకోవాలి.

"హాయ్, హాండ్‌సమ్!" అంటూ చెయ్యూపింది కవిత.

ఆ అబ్బాయి మొహం విప్పారింది. 'ప్రోగ్రాం రంజుగా వుండబోతోందని సంబరపడుతున్నాడు కాబోలు! మామూలుగా తత్తరపడుతూ కనబడేవాళ్లలా కాకుండా విభిన్నంగా కనబడినందుకు సంతోషమేమో! చూస్తాండమను. తనే ఒక ఆట ఆడిస్తుందితన్ని!'

"సెక్సీ అమ్మాయి పేరుకూడా సెక్సీగా వుంటుందా?" అంటున్నాడు హుషారుగా. మాటల్లో కొంటెతనం మహగుప్పించేస్తున్నాడు. టీవీలో మొహానికీ, బయటకనబడే మొహానికీ తేడావుంది. బయటే బాగున్నాడు.

"పేరు డబుల్ సెక్సీగావుంటుంది. మీరు ఊహించి చెప్పండి చూద్దాం!" అంది కవిత చమత్కారంలో నీకేమీ తీసిపోను సుమా అని చూపడానికి. అతను తల వంచుకుని ఆలోచిస్తుండగా చుట్టూ చూసింది, కెమెరా ఎక్కడ పెట్టారా అని. 'అయినా ఈ టాంక్‌బండ్ మీద ఇంత ఖాళీస్థలంలో కెమెరా ఎలా దాచగలరబ్బా?'

"మోహిని..?" అన్నాడా అబ్బాయి కాస్సేపటికి తలెత్తి.

"కాదు, ఇంకో ఛాన్స్ ఇస్తున్నా" అంది కన్నుగొడుతూ. 'కెమెరా ఎక్కడుందో తెలిస్తే బాగుణ్ను. కెమెరాకేసి చూసే కన్ను కొట్టవచ్చు. ఫోటోగ్రాఫర్ తెల్లబోతాడు. 'ఈ పిల్లెవర్రా బాబూ, మనని అవుట్ స్మార్ట్ చేస్తోందే!' అని.

"...రూపిణి."

"నిల్చోబెట్టే మాట్లాడతారా?" అంది చిలిపితనం ఒలకబోస్తూ.

"సారీ, సారీ. రండి, ఆ బెంచీమీద కూచుందాం" అన్నాడతను కవితను పక్కనవుండి నడిపిస్తూ.

'ఆఁ, బెంచీకి నడిపిస్తున్నాడంటే అదికూడా కెమెరా వ్యూలో వుందన్నమాట! దూరంగా కనబడుతున్న ఫ్లాట్స్‌లోపెట్టి జూమ్ చేస్తున్నారా?' అనుకోసాగింది కవిత, ఆ అబ్బాయి చేస్తున్న రొమాంటిక్ సంభాషణకు ఏ మాత్రం తీసిపోకుండా జవాబులు చెబుతూనే.

ఇద్దరూ పక్కపక్కన తగిలేలా కూచున్నాక కుర్రాడు హుషారు పెంచాడు. కవితకూడా రెచ్చిపోయింది. 'సాధారణంగా టీవీ ప్రేక్షకులు ఈ ప్రోగ్రాంలో కనబడేవాళ్లని బలిపశువుల్లా చూసి జాలిపడతారు. ఇవాళ వాళ్లుకూడా తన తెగువచూసి చప్పట్లు చరవాల్సిందే! తన ఫ్రెండ్సంతా మతులు పోగొట్టుకుని "అంత నిబ్బరంగా ఎలావున్నావే, మాకయితే మాత్రం కాళ్లూ, చేతులూ ఆడివుండేవికావు!" అంటూ తనను అభినందించేస్తారు. అప్పుడు కొట్టాలి పోజు..!'

ఆ అబ్బాయి అటూఇటూ చూసి చటుక్కున బెంచీమీదున్న చేతిని కవిత తల వెనకకు పోనిచ్చి పెదాలందుకుని గాఢంగా ముద్దుపెట్టుకోవడంతో, ఆమె ఆలోచనలకు అడ్డుకట్ట పడింది.

ఆమె బిత్తరపోయి, మూతి తుడుచుకుంటూ "ఏయ్! కెమెరాలో ఇదికూడా పడితే?" అని కోపం తెచ్చుకుంది. "మా అమ్మా, నాన్నా ప్రతీవారం ఈ ప్రోగ్రాం చూస్తారు తెలుసా?"

"కెమెరా ఏమిటి, ప్రోగ్రాం ఏమిటి? ఇక్కడ దగ్గర్లో ఎవరూలేరు. అందుకే.." అన్నాడు అతను తికమకపడుతూ.

"నాకు తెలుసులే. వేషాలేయకు! 'టేకిట్ ఈజీ' ప్రోగ్రాం కదూ ఇది? నన్ను బురిడీ కొట్టించాలని చూడకు! నాకన్నీ తెలుసు."

"ఆ ప్రోగ్రాంతో నాకేం సంబంధం? అయినా ఇది ప్రోగ్రామేమిటి?"

"చూడు మిస్టర్! నాకన్నీ తెలుసు. ఇలా బుకాయించడం కూడా కొన్ని ఎపిసోడ్స్‌లో చూశా. నువ్వు 'టేకిట్ ఈజీ'లో కనబడే ప్రదీప్‌వని చూడగానే గుర్తుపట్టేశా!"

"ఛ,ఛ, నేను ప్రదీప్‌నేమిటి? వాడు నాకు కజినవుతాడు. నేను... మోహన్రావుని... ఇంజనీరింగు చేస్తున్నాను."

"ఆఁ! పచ్చిమోసం! ప్రోగ్రామనుకుని ఇంతదూరం వస్తే..." ఆపైన ఏమనాలో తెలియక కవిత ఆగిపోయింది.

అతని మొహం వివర్ణమైంది. "ప్రోగ్రాం అనుకుని ఇంత రెస్పాన్స్ ఇచ్చారా? అదీసంగతి! లేకపోతే నా మొహానికి ... ఇంత అందమైన అమ్మాయి... అంత భాగ్యమా?" అన్నాడు తలవంచుకుని.

ఆమె సిగ్గుపడింది. తన ప్రవర్తన సమీక్షించుకుంటే తనదే తప్పనిపించింది. ఓదార్పుగా "అలా అనుకోకండి. మీ మొహం బాగానే వుందికానీ... నేనే... జస్ట్ డిజప్పాయింట్‌మెంట్... చెప్పాలంటే తొలిముద్దనేది

ఎంతో మధురంగా వుండాలని కలగన్నాను. కానీ ఇలా కన్ఫ్యూజన్లో జరగడం నాకు బాధగావుంది. అందుకనే అలా..."

"ఆ మాటకొస్తే నాకూ అది తొలిముద్దే. ఇలా నామీద అభిమానంలేని వ్యక్తితో పొరపాటు అభిప్రాయంతో... అలా జరగడం నాకూ బాధగానేవుంది."

ఇద్దరూ కాస్సేపు మౌనంగా ఒకరినొకరు చూసుకున్నారు. 'కుర్రాడు మంచివాడే' అనుకుందామె. 'బాగున్నాడు' అనికూడా అనుకుంది. అతను తన చెయ్యి అందుకుని గాజులు సవరిస్తూంటే చూస్తూ కూచుంది.

అతను గొంతు సవరించుకుని, "నేనో సలహా చెప్తాను. నచ్చితే చెప్పండి. మన తొలిముద్దు ఇలా జరగడం ఇద్దరికీ బాగాలేదు కదా, అది ఆకాశానికి ఇచ్చేశామనుకుందాం. ఈ సారి సరిగ్గా, మనస్ఫూర్తిగా పెట్టుకుందాం, సరేనా?" అన్నాడు.

ఆమె తలవూపింది.

ఇద్దరూ గాఢపరిష్వంగంలోంచి, ప్రగాఢచుంబనంలోంచి బయటపడ్డాక ఆమె "ఇది భూమాత కిచ్చేశామనుకుందాం. ఈ సారిది తొలిముద్దనుకుందాం" అంటూ అతన్ని మళ్లీ దగ్గరకు లాక్కుంది. ■

